సాక్షి
పల్నాడు
గురువారం । 16 । అక్టోబర్ । 2025



న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

నరసరావుపేట టౌన్: 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్. సత్యశ్రీని పల్నాడు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 53,210 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 7,620 క్యూసెక్కులు వదులుతున్నారు.



4,130 లీటర్ల మద్యం ధ్వంసం

దాచేపల్లి : అక్రమ మద్యం కేసుల్లో స్వాధీనం చేసుకున్న 4,130 లీటర్ల మద్యాన్ని బుధవారం పోలీసులు ధ్వంసం చేశారు. గురజాల డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు



జరాడ్‌బాబు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా పణిదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎం. జరాడ్‌బాబుపై సస్పెన్షన్ వేటు పడింది. పాఠశాలలో పదో తరగతి విద్యార్థినితో ఈ నెల 13న అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె జరిగిన సంఘటనను తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో మర్నాడు తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ పెద్దలు, మహిళలు ఉపాధ్యాయుడిని నిలదీశారు. ఈ క్రమంలో కొందరు మహిళలు దేహశుద్ధి కూడా చేశారు. దీనిపై విద్యాశాఖ అధికారులు పంపిన ప్రాథమిక నివేదిక ఆధారంగా జరాడ్ బాబును సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎల్. చంద్రకళ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు క్రస్ట్ గేట్లు ద్వారా నీటి విడుదల



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 67,030 క్యూసెక్కులు వచ్చి చేరటంతో ఇక్కడి నుంచి అంతే మొత్తంలో అధికారులు దిగువకు వదులుతున్నారు. అందులో కుడి కాలువకు 10,040, ఎడమ కాలువకు 6,401, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,251, ఎస్ఎల్‌బీసీకి 1,200 క్యూసెక్కుల వరద చేరుతోంది. ప్రస్తుతం సాగర్ జలాశయంలో 311.1486 టీఎంసీలు నిల్వ ఉంది.

నివాసాల మధ్య కొండచిలువ

భయంతో చంపేసిన స్థానికులు



తాడేపల్లి రూరల్: మండలంలోని ఉండవల్లి సెంటర్ హిందూ శ్మశానవాటిక దగ్గరున్న నివాసాల మధ్యలో బుధవారం ఏడు అడుగుల పొడవున్న కొండచిలువ హల్‌చల్ చేసింది. తెల్లవారుజామున ఇళ్లల్లోకి దూరి, కోళ్లు తినే ప్రయత్నం చేసింది. గమనించిన స్థానికులు పెద్ద పెద్ద కేకలు వేయడంతో కోళ్ల గంప నుంచి బయటకు వచ్చింది. రోడ్డుకు ఇరువైపులా తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. దీంతో స్థానికులు భయంతో దాన్ని చంపేశారు. పీడబ్ల్యూడీ వర్క్ షాపులో ఉన్న సామగ్రి తొలగించడంతో అక్కడి నుంచి కొండచిలువ వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంకా ఇలాంటి విష సర్పాలు ఎన్ని వస్తాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాపట్ల జేసీగా భావన వశిష్ట బాధ్యతల స్వీకారం



బాపట్ల: జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట బుధవారం బాధ్యతలు చేపట్టారు. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈమె కాకినాడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో కృష్ణా జిల్లాలో ఏసీయూటీ, పార్వతీపురంలో సబ్ కలెక్టర్, జీఎస్ఎస్‌డబ్ల్యూఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్, ఆ జిల్లాలో సంయుక్త కలెక్టర్ పని చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. తొలుత ఆమెకు డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్, జిల్లా కలెక్టరేట్ ఏఓ మల్లికార్జునరావు ఘన స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్నీ జిల్లాలోని పేద ప్రజలకు అందేలా చూస్తామన్నారు. ఆమెను అభినందించిన వారిలో బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు పి.గ్లోరియా, చంద్రశేఖర్ నాయుడు, ఎస్.రామలక్ష్మి, బాపట్ల తహసీల్దార్ సలీమా షేక్ ఉన్నారు.

నిజంపై కూటమి జులుం

సాక్షిపై అక్రమ కేసులు

వాస్తవాలను వెలుగులోకి తెస్తున్నందుకే సాక్షి పత్రికపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. నిజాలు రాస్తుంటే తట్టుకోలేక కేసుల మీద కేసులు పెడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాక్షి విలేకరులు, ఎడిటర్‌పై ఏకంగా ఐదు కేసులు నమోదు చేసింది. ఇవన్నీ కూడా ప్రభుత్వ వైఫల్యాలు, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రశ్నించినందుకు పెట్టినవే కావడం విశేషం. సాక్షి గొంతు నొక్కడానికి కుట్రలో భాగంగానే ప్రభుత్వం పోలీసులను పావులుగా ఉపయోగిస్తోంది. తమకు అనుకూలంగా ఉండే అధికారులతో ఫిర్యాదులు చేయించి, పోలీసులతో కేసులు నమోదు చేయిస్తోంది. బెయిలబుల్ కేసుల్లో కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలనే కక్షపూరిత వైఖరిని అవలంబిస్తోంది.

- అతిగా మద్యం తాగి చనిపోయాడని రాసినా కేసు
- దేశం నేతలు హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ రాస్తే నాన్ బెయిలబుల్ కేసు
- వర్షాలకు పంట పొలాలు మునిగిపోయాయని చెప్పిన ప్రెస్‌మీట్ కవర్ చేస్తే కేసు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో అక్రమ కేసుల పరంపర
- ఇటీవల సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిని మూడు గంటల సేపు విచారించిన తాడేపల్లి పోలీసులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గతంలో తెలుగుదేశం నాయకులు, అమరావతి జేఏసీతో కలిసి మంగళగిరి సాక్షి కార్యాలయంపై దాడి చేశారు. అయితే, దీనిపై ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ పోలీసులు కేసు కూడా నమోదు చేయలేదు. నరసరావుపేట బరంపేట చాకిరాలగుట్టకు చెందిన పాలెం కోటేశ్వరరావు అతిగా మద్యం తాగి చనిపోయాడని పోలీసులు చెప్పారు. దాన్ని సాక్షితో పాటు ఈనాడు, ఆంధ్రజ్యోతి కూడా రాశాయి. అయితే, ఆ వార్తను రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో మద్యం తాగి చనిపోయిన వాళ్లతో కలిపి వాడారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సాక్షిపై మద్యం తాగి చనిపోయిన వ్యక్తి భార్య నుంచి



జూన్ 9న మంగళగిరిలోని సాక్షి యూనిట్ కార్యాలయంపై దాడి చేస్తున్న కూటమి శ్రేణులు

ఫిర్యాదు తీసుకుని క్రిమినల్ కేసు నమోదు చేశారు.

✔ రెండు నెలల క్రితం వరుసగా కురిసిన భారీ వర్షాలకు కొండవీటి వాగు పొంగి పొన్నూరు నియోజకవర్గంలో వేల ఎకరాల్లో పంట పొలాలు మునిగిపోయాయని వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ చెప్పిన విషయాన్ని సాక్షి ప్రచురించింది. దీనిపై తాడేపల్లి, పొన్నూరులలో ఇరిగేషన్ అధికారులతో ఫిర్యాదు చేయించి ఎడిటర్‌పై కేసులు నమోదు చేశారు.

✔ డీఎస్పీల ప్రమోషన్లలో అవకతవకలపై రాసిన కథనానికి రాష్ట్ర పోలీసు అధికారుల సంఘ నేతలతో ఫిర్యాదు చేయించింది. తాడేపల్లి స్టేషన్‌లో ఎడిటర్‌తో పాటు మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో వారిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారణ పేరుతో మూడు గంటలపాటు హైడ్రామా నడిపారు.



సెప్టెంబర్ 11న సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డికి సంఘీభావంగా గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న జర్నలిస్టులు

✔ పల్నాడు జిల్లాలో జరిగిన ఓ హత్య కేసుకు సంబంధించి తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో ప్రచురితమైన కథనాల ఆధారంగా సాక్షి యాజమాన్యంపై కుట్రపూరిత కేసులకు దిగారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని పశువేముల గ్రామానికి చెందిన పండ్ల హరిశ్చంద్ర వైఎస్సార్ సీపీలో క్రియాశీలక నాయకుడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హరిశ్చంద్ర లక్ష్యంగా టీడీపీ నాయకులు వేధింపులకు పాల్పడ్డారు. దీంతో కుటుంబం గ్రామం వదిలి తెలంగాణలోని నల్లగొండ జిల్లా కనగల్‌లో తలదాచుకుంటోంది. హరిశ్చంద్ర సామాజిక పింఛన్ డబ్బుల కోసం ప్రతి నెలా గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ నేతలు కిడ్నాప్ చేశారు. ఆయన భార్య నిర్మల భర్త కిడ్నాప్ అయినట్లు తెలంగాణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన నల్లగొండ జిల్లా విజయపురి టౌన్ పోలీసులు, పశువేములలో హరిశ్చంద్ర మృతదేహాన్ని గుర్తించారు. తెలంగాణ పోలీసులు మృతుని భార్య ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఇదే విషయాన్ని అక్కడ సాక్షి పాత్రికేయులు కథనం అందించారు. ఆంధ్రప్రదేశ్‌లో కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియడం, మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన వాంగ్మూలం మేరకు కథనం ప్రచురించారు. దీనిపై తెలుగుదేశం పార్టీ నాయకులు ఆగమేఘాల మీద సాక్షి యాజమాన్యం, సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెంటనే స్పందించి సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

పత్రికా స్వాతంత్ర్యాన్ని కాపాడాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాగానే అమలు చేసిన రెడ్‌బుక్ రాజ్యాంగపు దాడులు, హత్యలను సాక్షి పత్రిక మాత్రమే సాహసోపేతంగా వెలుగులోకి తెచ్చింది. గొప్పగా ప్రతిపక్ష పాత్ర పోషించింది. దీన్ని సహించలేని కూటమి ప్రభుత్వం సాక్షి పత్రిక కార్యాలయం మీద, ఎడిటర్ ధనుంజయరెడ్డిపై వేధింపులు, దాడులను పోలీసులతో చేయిస్తోంది. హైకోర్టు, సుప్రీం కోర్టులు, ప్రెస్ కౌన్సిల్ మందలించినా కూడా ధోరణి మారలేదు. ఉన్నత న్యాయస్థానమే సుమోటోగా కేసు తీసుకుని దీనిపై న్యాయం చేయాలి.

– ఈదర గోపీచంద్, నైతిక విప్లవం పత్రిక ఎడిటర్

పత్రికలకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పత్రికలకు ప్రాధాన్యతతో పాటు స్వేచ్ఛ ఇవ్వాలి. ఫోర్త్ ఎస్టేట్‌గా మీడియా ఉన్నప్పుడు దాని పూర్తి స్వేచ్ఛ నిచ్చే బాధ్యత ప్రభుత్వాలు వహించాలి. పత్రికలపై రాజకీయ కక్షలకు పాల్పడ కూడదు. పత్రికలు సమస్యలను రాసినప్పుడు వాటిని పరిష్కరించాలి గానీ పోలీసుల ద్వారా దాడులు చేసి, భయభ్రాంతులకు గురి చేయడం సరికాదు.

– నళినీకాంత్, సీపీఎం నగర కార్యదర్శి

పత్రికలు ప్రజా గొంతుకలు



ప్రజా గొంతుగా సాక్షి పని చేస్తోంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా పత్రికలే ప్రతిపక్షాలుగా నిలబడతాయి. ప్రజాభిప్రాయాలు, ప్రజలకు, ప్రభుత్వాలకు పత్రికలు వారధులుగా వ్యవహరిస్తాయి. ప్రజల గొంతుక అయిన పత్రికలపై దాడులు చేయడం అనాగరికం. ప్రభుత్వాలపై వచ్చే వార్తలకు స్పందించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలి. వార్తలు రాసిన పత్రికలపై దాడులు చేయడం దారుణం. గతంలో ఎన్నడూ ఇలాంటివి జరగలేదు. ప్రధానంగా రాష్ట్రంలో గత కొంత కాలంగా సాక్షి ఎడిటోరియల్, సిబ్బంది, విలేకరులపై ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయిస్తూ, కేసులు బనాయించడం సరికాదు.

– కొండా శివరామిరెడ్డి, అవగాహన సంస్థ కార్యదర్శి

వేధింపులు సిగ్గుచేటు



కల్తీ మద్యం తాగి మృతి చెందాడని ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చిన వారిని అభినందించాల్సింది పోయి కేసులు పెట్టడం సబబు కాదు. నోటీసుల పేరుతో వారిని ఇబ్బందిపెట్టే ప్రక్రియ ఏమాత్రం క్షమార్హం కాదు. పత్రికల కార్యాలయాలకు పోలీసులు వెళ్లి విచారణ పేరుతో ఇబ్బందులు పెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకం. ప్రభుత్వం ఇప్పటికైనా తప్పును తెలుసుకొని వ్యవహరించాలి.

–స్వామి, ఇంటలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి

ముమ్మాటికీ కూటమి హత్యలే !

- తురకపాలెంలో బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ
- మరణాలకు కూటమి ప్రభుత్వమే కారణం
- గ్రామస్తులపై వివక్ష, సామాజిక బహిష్కరణ బాధాకరం
- 45 మంది చనిపోతే 29 మందికే పరిహారమా ?
- గ్రామస్తులకు న్యాయం జరిగే దాకా వైఎస్సార్ సీపీ పోరాటం



తురకపాలెంలో పర్యటిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గుంటూరు రూరల్: తురకపాలెంలో మరణాలన్నీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జరిగాయని వైఎస్సార్ సీపీ నేతలు ఆరోపించారు. ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని ధ్వజమెత్తారు. రూరల్ మండలంలోని తురకపాలెం గ్రామాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ నేతలు సందర్శించారు. అంతుచిక్కని వ్యాధితో అకాల మరణాలకు గురైన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇంకా జ్వరం, శరీరంపై గడ్డలతో బాధపడుతున్న బాధితుల ఇళ్లకు వెళ్లి మనోధైర్యాన్ని కల్పించారు. వైఎస్సార్ సీపీ నేతలతో పాటు వైద్యుల బృందం బాధితుల రిపోర్టులు పరిశీలించి వైద్య సలహాలను అందించింది. గ్రామస్తులను పలకరించి వారి సమస్యలు, సంఘటనలు జరిగిన తీరును నాయకులు తెలుసుకున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం

కూటమి ప్రభుత్వం వెంటనే మృతుల కుటుంబాలకు కోటి రూపాయల ఆర్థిక సాయం అందించాలని, నిర్లక్ష్యాన్ని విడనాడాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ నేతలు నినాదాలు చేశారు. గ్రామస్తులను సామాజిక బహిష్కరణ చేయడం సబబు కాదని నినాదాలు చేశారు.

■ వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహనరావు మాట్లాడుతూ మెలియాయిడోసిస్ వ్యాధి ఒక్కరోజులో తగ్గేది కాదని, బాధితులకు జాగ్రత్తగా చికిత్స చేయాలని తెలిపారు. ఈ విషయం తెలిసి కూడా ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు గ్రామ ప్రజలపై వివక్ష చూపారని ఆయన ఆరోపించారు. దళితులే ఎక్కువగా చనిపోయారు కాబట్టి గ్రామాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ప్రాణాలకు రూ 5 లక్షల విలువ కట్టి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా సీఎం చంద్రబాబునాయుడు, నారా లోకేష్, పవన్ కల్యాణ్‌లు పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

■ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మృతుల కుటుంబాల్లో ప్రతి ఒక్కరికీ కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం గ్రామంలో వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం ఉచిత వైద్యం అందించాలని కోరారు.

■ మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆరు నెలల్లో 45 మంది చనిపోతే 29 మందికి ఎక్స్‌గ్రేసియా ప్రకటించడం బాధాకరమని పేర్కొన్నారు. అదికూడా అందరికీ దక్కకపోవడం విచారకరమని తెలిపారు. గ్రామంలో సామాజిక బహిష్కరణలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని ఖండించారు. గ్రామస్తులు పనులకు వెళ్లినా, విద్యార్థులు స్కూళ్లకు వెళ్లినా వివక్ష చూపుతున్నారని పేర్కొన్నారు. బంధువులు కూడా గ్రామస్తులను దూరం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

■ మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ కృష్ణ గుంటూరు జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టే లేదని మండిపడ్డారు. నెల రోజుల్లో ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ట్రస్ట్ ద్వారా గ్రామంలో తాగునీటి సౌకర్యార్థం వాటర్ ప్లాంట్‌ను నిర్మిస్తామని తెలిపారు.

■ సత్తెనపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ సుధీర్‌బార్గవ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో 365 రోజులు, 24 గంటలు కార్పొరేట్ వైద్యం అందేలా చేస్తేనే ప్రజల ఆరోగ్యం మెరుగు పడుతుందని సూచించారు.

■ వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ శివభార్గవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యం రంగం పడకేసిందని, ప్రజల ఆరోగ్యాన్ని ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు.

■ తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జ్, నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా మాట్లాడుతూ నిండు ప్రాణం ఖరీదు రూ. 5 లక్షలు కట్టటం బాధాకరమని, కూటమి ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలంటే విలువలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని తెలిపారు.

■ గుంటూరు పార్లమెంట్ పరిశీలకుడు పోతిన మహేష్ మాట్లాడుతూ గ్రామంలో 45 మంది చనిపోయినా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. నారా లోకేష్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ప్రజల రక్షణకు, ఆరోగ్య భద్రతకు చంద్రబాబు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

■ నియోజకవర్గం పరిశీలకుడు గులాం రసూల్ మాట్లాడుతూ తురకపాలెం గ్రామానికి గుంటూరు నుంచి పైప్‌లైన్ నిర్మించి త్రాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తిని శివకుమార్, ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పట్టించుకోలేదు



కృష్ణవేణి భర్త దుర్గాతో మాట్లాడుతున్న నేతలు

మా ఆవిడకు నాలుగు రోజులు జ్వరం వచ్చింది. మంగళగిరిలో చూపించాం. అక్కడ తురకపాలెం గ్రామం అని చెప్పడంతో వాళ్ళు కొన్ని పరీక్షలు చేసి, ఇక్కడ కాదు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లండని చెప్పారు. అక్కడకు వెళితే ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎవ్వరూ పట్టించుకోలేదు. ఆక్సిజన్ పెట్టమని అడిగినా ఎవ్వరూ పట్టించుకోలేదు. సరైన వైద్యం అందక నా భార్య చనిపోయింది.

– ఇటీవల మృతి చెందిన కృష్ణవేణి భర్త దుర్గా

అధికారులు స్పందించ లేదు



నాగిరెడ్డితో మాట్లాడుతున్న నేతలు

రెండు నెలల కిందట నాకు జ్వరం వచ్చింది. రెండు రోజులకు తగ్గింది. తరువాత శరీరంపై గడ్డ వచ్చింది. వెంటనే గుంటూరులో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లా. ఆపరేషన్ చేసి గడ్డను తొలగించారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి డ్రెస్సింగ్, ఆరు నెలల పాటు పరిశీలనలో ఉండాలని చెప్పారు. గతంలో మా గ్రామానికి బోరు పని చేయకపోవడంతో క్వారీ గుంత నుంచి అందించారు. అప్పటి నుంచి గ్రామంలో ప్రతి రెండు రోజులకు ఒక సంఘటన జరుగుతూనే ఉంది. నాకు చికిత్సలకే రూ. 5 లక్షలు ఖర్చయింది.

– మెట్టు నాగిరెడ్డి, గ్రామస్తుడు

ప్రైవేటు ఆసుపత్రి ఖర్చులు భరించలేం



నక్కా నాగేశ్వరరావు భార్య రిపోర్ట్‌లు, వివరాలు తెలుసుకుంటున్న నేతలు

నా భార్యకు నెల రోజుల కిందట శరీరంపై గడ్డ వచ్చింది. ప్రభుత్వాసుపత్రికి వెళితే పట్టించుకోవడం లేదని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లా. ఆపరేషన్ చేసి గడ్డను తొలగించారు. ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాం. వేలకు వేలు ఖర్చవుతున్నాయి. జ్వరం రెండు రోజులు తగ్గుతుంది.. మరలా వస్తోంది. డాక్టర్లే ఇది అప్పుడే తగ్గదు టైం పడుతుంది అంటున్నారు. ప్రైవేటు ఆసుపత్రి ఖర్చులు భరించలేక పోతున్నారు. ప్రభుత్వం పట్టించుకోక పోడంతో మా గ్రామస్తులు చనిపోయారు.

– నక్కా నాగేశ్వరరావు గ్రామస్తుడు

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధే లక్ష్యం

జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



నరసరావుపేట: జిల్లా పరిధిలో పరిశ్రమల ఆధునికీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి, శుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్‌లో భాగంగా విస్తృత కార్యక్రమాలు ప్రారంభించినట్లు కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను విడుదల చేసిన అనంతరం ఆమె మాట్లాడారు.

కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి నవంబర్ 15 వరకు పరిశ్రమల్లో మౌలిక సదుపాయాల ఆధునీకరణ, స్థిరమైన అభివృద్ధి చర్యలు, పరిశ్రమలు – పెట్టుబడుల ప్రోత్సాహ కార్యక్రమాలు, శుభ్రత – పారిశుద్ధ్య డ్రైవ్‌తో పాటు మొక్కల నాటనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శుభ్రమైన పారిశ్రామిక వాడల స్థాపన, పెట్టుబడిదారుల సహకారం ద్వారా పరిశ్రమల వృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ వివరించారు. పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి, పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

రైతు బజార్ తనిఖీ



బాపట్ల: రైతు బజార్‌లో రైతులు పంటలు విక్రయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్‌శాఖ ఏడీ కారుమూరి రమేష్‌బాబు ఆదేశించారు. స్థానిక రైతు బజార్‌ని బుధవారం తనిఖీ చేశారు. మౌలిక వసతులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఆయన వెంట రైతు బజార్ ఎస్టేట్ అధికారి ఘట్రాజు ఫణీంద్ర ఉన్నారు.

క్లుప్తంగా

రైలులో ప్రయాణికురాలిపై లైంగికదాడి

కత్తితో బెదిరించి అఘాయిత్యం చేసిన దుండగుడు

లక్ష్మీపురం: మహిళల బోగీలో ఒంటరిగా ఉన్న ప్రయాణికురాలిపై గుర్తు తెలియని వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. సెల్‌ఫోన్, నగదు తీసుకుని పారిపోయాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. రాజమండ్రి ప్రాంతానికి చెందిన సుమారు 35 ఏళ్ల ఓ మహిళ మంగళవారం సంత్రగచి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు చర్లపల్లి వరకు వెళ్లేందుకు ఎక్కారు. గుంటూరు రైల్వే స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఆ బోగీలో అందరూ దిగిపోయారు. ఇదే అదనుగా ఓ గుర్తు తెలియని వ్యక్తి లోపలికి చొరబడ్డాడు. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలోకి వచ్చాక ఆ మహిళను కత్తితో బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె నుంచి రూ.5,600 నగదు, సెల్‌ఫోన్ లాక్కుని పెదకూరపాడు స్టేషన్‌కు సమీపంలో రైలులో నుంచి దూకి పారిపోయాడు. బాధితురాలు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గుంటూరు నుంచి పెదకూరపాడు ప్రాంతాల మధ్యలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలోని సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఏర్పాటు చేయబడిన ఈ హాస్టల్స్‌లో సమస్యలు తిష్టవేశాయన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిస్థితి మారలేదన్నారు. మంగళగిరి నడిబొడ్డున నేషనల్ హైవే పక్కన ఎస్.సి. బాలుర హాస్టల్‌లో అత్యంత ఘోరంగా వసతులు ఉన్నాయన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉండి కూడా తన నియోజకవర్గ పరిధిలోని హాస్టల్‌ల సమస్యల పరిష్కారానికి లోకేష్ చొరవ చూపకపోవడం తగదన్నారు.

పత్తి కొనుగోలు నిబంధనలను సడలించాలి

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): డాక్టర్ స్వామినాథన్ సిఫారసుల ప్రకారం క్వింటా పత్తికి రూ.10,073 ధర నిర్ణయించి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, గుంటూరు జిల్లా కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.వి. జగనాదం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలోని మల్లయ్య లింగంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పత్తి కొనుగోలులో వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కూడా దక్కనివ్వడం లేదన్నారు. క్వింటా పత్తిని రూ.5 వేలలోపునకు కొనుగోలు చేసి రైతుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు.

రావు బాలసరస్వతి... అనుకరణలకు అతీతమైన అద్భుత స్వరం...ప్రేక్షకులకో వరం. సంగీతంలో ప్రత్యేక శిక్షణ లేకుండానే తనదైన శైలిని, బాణీలో విశిష్టతను సాధించారు. సినీ సంగీతానికి కొత్త ఒరవడిని కల్పించారు. లలిత సంగీతం పేరుతో నూతన విభాగాన్ని ఆవిష్కరించారు. ఆరేళ్ల బాల్యంలో ఆరంభించి, రెండున్నర దశాబ్దాలు విరామం లేకుండా సినిమా, రేడియో, ప్రైవేటు గ్రామఫోన్ రికార్డుల్లో ఆమె స్వరం వీనులవిందు చేసింది. వివిధ భాషల్లో మూడువేలకు పైగా గీతాలను మధురంగా ఆలపించిన తొలి తరం నేపథ్యగాయని ఆమె ఉమ్మడి గుంటూరు జిల్లా వాసి కావటం విశేషం.

లలిత సంగీత సరస్వతి

- తొలి అడుగులు గుంటూరులోనే..
- బాలగాయనిగా ఇక్కడి నుంచే సినీప్రస్థానం
- గతంలో విశిష్ట సేవా పురస్కారంతో సత్కారం



రావు బాలసరస్వతి (ఫైల్)

తెనాలి: బాలసరస్వతి స్వస్థలం ఉమ్మడి తెనాలి డివిజనులోని బాపట్ల. 1928 ఆగస్టు 28న జన్మించారు. తల్లిదండ్రులు విశాలాక్షి, పార్థసారథిరావు. లలిత కళలపై అభిమానం కలిగిన తండ్రి సితార, వీణ వాయించేవారు. గుంటూరులో రత్నా థియేటర్ పేరుతో సినిమాహాలు నిర్మించారు. థియేటరులో ప్రదర్శించే ఏదైనా సినిమాలో సంగీతానికి తగినంత ప్రాధాన్యం లేదని అనిపిస్తే, వెంటనే ఆ సినిమా ప్రదర్శన నిలిపివేసి, అందుబాటులో ఉన్న నాటక సమాజాన్ని పిలిపించి, పద్యనాటకం వేయించారు. అంతటి సంగీతాభిమాని ఆయన. కాలక్రమంలో వ్యాపారం దెబ్బతిని, థియేటర్ మూతపడింది.

వారసత్వంగా ...

తండ్రి వారసత్వం అన్నట్టుగా బాలసరస్వతికి సంగీతంపై ఆసక్తి ఏర్పడింది. అక్క, అన్నయ్య చక్కగా చదువుకుంటున్నా తండ్రితోపాటు నాటకాలు చూడటం, వాటిలోని పాటలు గానం చేయటం అలవాటైంది. అప్పట్లో గుంటూరులో హెచ్ఎంవీ (హిజ్ మాస్టర్స్ వాయిస్) గ్రామఫోను కంపెనీ ఆఫీసుండేది. పార్థసారథిరావుకు పరిచయస్తులు. ఓసారి బాలసరస్వతిని పిలిపించి, ట్రెనింగ్‌లా పాడమన్నారు. బాగుండటంతో బెంగళూరులో రికార్డు చేశారు. ఆ విధంగా 1934లో ఆరేళ్ల వయసులో సోలో రికార్డు పాడిన ఘనతను బాలసరస్వతి దక్కించుకున్నారు. మైకు అందేంత ఎత్తు లేకపోవటతో సినీనటుడు సత్యం సోదరుడు కామేశ్వరరావు ఎత్తుకోగా, ఆమె ఆ పాట పాడారు.

శ్రోతలను ఆకట్టుకునేలా..

అంతకుముందు 1941లో రేణుకావారి 'భాగ్యలక్ష్మి' సినిమాలో బీఎస్‌ఆర్ సంగీత దర్శకత్వంలో పాడిన 'తిన్నెమీద చిన్నోడా' పాట బాలసరస్వతి తొలి ప్లేబాక్ పాట. సుతిమెత్తగా, చక్కని భావప్రకటనతో, ప్రత్యేకమైన పాడే విధానంతో శ్రోతలను ఆకట్టుకుని మనసు లోతుల్లోకి ప్రవహించే అమృతధారగా పాటను మార్చుకున్న ప్రతిభాశాలి బాలసరస్వతి. 'స్వప్నసుందరి'లో కథానాయిక కోసం పాడినా, 'దేవదాసు'లో ద్వితీయ నాయికకు గానం చేసినా ఆమె తనకు తానే సాటిగా నిలిచారు. సినిమాలకు పాడుతూనే ఎస్.రాజేశ్వరరావు, బాలసరస్వతి కలిసి 'లలిత సంగీతం' పేరిట, తెలుగు సంగీత ప్రపంచంలో కొత్త విభాగాన్ని ఆవిష్కరించారు. ఆకాశవాణిలో వీరిద్దరూ పాడే లలిత గీతాలు లక్షల సంఖ్యలో అభిమానులను సంపాదించారు. 1946లో సింహళ చిత్రం 'లైలా మజ్నూ'కు సంగీతం సమకూర్చారు. తాను సోలోగా పాడిన ప్రైవేటు గీతాలకు స్వయంగా సంగీతబద్ధం చేసుకుంటూ వచ్చారు. 1974లో భర్త మరణం, దివాణాలు, వైభవాలు అంతరించటంతో చెన్నై, తర్వాత మైసూరు, బెంగళూరులో ఉంటూ 1995లో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. భూములు పోయినా నష్టపరిహారం అందలేదు. మైసూరు నుంచి హైదరాబాద్ వస్తే సాంస్కృతిక శాఖలో ఉద్యోగం ఇస్తామన్న ఎన్టీ రామారావు ఆహ్వానంపై ఇక్కడికి వచ్చేసరికి రాజకీయాలు మారిపోయాయి. 2015లో గుంటూరులో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ బాలసరస్వతిని విశిష్ట సేవా పురస్కారంతో సత్కరించి రూ.లక్ష నగదు, రజత జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా 'నిండుపున్నమి పండువెన్నెల' పేరుతో అభినందన సంచికను విడుదల చేశారు.



2015లో గుంటూరులో విశిష్ట సేవాపురస్కారం ప్రదానం



తెనాలి నటులతో కలిసి నటించిన 'రాధిక' చిత్రంలో..

అలా బీజం పడింది...

ఆ సమయంలో అక్కడే ఉన్న సుప్రసిద్ధ దర్శకుడు సి.పుల్లయ్య, తన 'సతీఅనసూయ–భక్త ధృవ' సినిమాలో బాలనటిగా తీసుకున్నారు. అందులో గంగ పాత్రలో నటిస్తూ బాలసరస్వతి పాడిన పాట 'ఏదీ దారి నాకిచట' ఆ రోజుల్లో పెద్ద హిట్. కోల్‌కతాలో ఈ షూటింగ్ జరుగుతుండగా, అక్కడే చిత్రీకరిస్తున్న తమిళ చిత్రం 'భక్త కుచేల'లో రెండు పాత్రలు ఇచ్చారు. మొదటి భాగంలో చిన్న కృష్ణుడు, రెండో భాగంలో కుచేలుని కూతురు పాత్రలో పోషించారు. అందులో పాటలు కూడా తానే పాడారు. తర్వాత 'బాలయోగిని' తమిళ సినిమాలో టైటిల్ రోల్ తనదే. అప్పటివరకు సరస్వతిగా ఉన్న ఆమె పేరుకు ముందు 'బాల' అని అప్పుడే కలిపారు. తన సినిమాల్లోని పాటలు, బయట కచేరీల్లో పాడుతూ బహుమతులను అందుకుంటూ వచ్చారు. బాలయోగిని సినిమా తర్వాత చెన్నైలో సెటిలయ్యారు. బాలనటిగా 'తుకారం' (1937), 'మహానంద', 'తిరునీలంకర్' (1939) సినిమాల్లో నటించాక, 1940లో ఇందిరా వారి 'ఇల్లాలు' సినిమాలో సంగీత దర్శకుడు ఎస్.రాజేశ్వరరావుతో కలిసి నటించారు. వరుసగా సినిమాల్లో నటిస్తుండగానే 1944లో తూర్పుగోదావరి జిల్లా కోలంక జమీందారు రావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావుతో వివాహమైంది. దీనితో నటనకు స్వస్తిపలికి, పాటలకే పరిమితమయ్యారు.

విద్యుత్ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

- నరసరావుపేట మండలంలో 4219 సర్వీసులు పరిశీలన
- రూ.5.66లక్షల అపరాధ రుసుము విధింపు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నరసరావుపేట: విద్యుత్ పంపిణీ విభాగంలోని డీ-3 సెక్షన్‌లో 4219 సర్వీసులు తనిఖీ చేసి రూ.5.66లక్షల అపరాధ రుసుం విధించినట్లు విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగం అధికారులు వెల్లడించారు. బుధవారం బరంపేటలోని విద్యుత్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. జిల్లా పర్యవేక్షక ఇంజినీరు డాక్టర్ పి.విజయకుమార్ ఆధ్వర్యంలో నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, చింతలపాలెం, అర్వపల్లి, అల్లూరివారిపాలెం, అచ్చంవారిపాలెం, గోనెపూడి, దొండపాడు, ఇక్కుర్తి, జొన్నలగడ్డ, కాకాని, కేశానుపల్లి, కోటప్పకొండ, కొత్తపాలెం గ్రామాల్లో విస్తృత తనిఖీలు చేశామని విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎస్ఏ కరీమ్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సీహెచ్ రాంబొట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో 53 మంది అధికారులు, 159మంది సిబ్బంది 53 బృందాలుగా ఏర్పడి సర్వీసులను తనిఖీ చేశారన్నారు. మీటరు లేకుండా డైరెక్ట్‌గా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 24మందిని గుర్తించి వారి వద్ద నుంచి రూ.35వేలు, మీటరు ఉన్నా చౌర్యానికి పాల్పడుతున్న తొమ్మిది మంది వద్ద నుంచి రూ.1.30లక్షలు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీలలో విద్యుత్ వాడుతున్న ఐదుగురికి రూ.47వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుకుంటున్న 81మందిపై రూ.3.54లక్షలు అపరాధ రుసుం విధించామన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, చౌర్యానికి పాల్పడుతున్న వారి గురించి 94408 12263, 86397 41050 నెంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచటం జరుగుతుందని వెల్లడించారు. ఈ దాడుల్లో ఆపరేషన్ విభాగ డీఈఈ జీఎల్‌వీ ప్రసాదరావు, విజిలెన్స్ డీఈఈ ఎస్.శ్రీనివాసరావు, కె.రవికుమార్, ఎన్.మల్లికార్జునప్రసాదు, ఆపరేషన్ విభాగ ఏఈ కె.రాంబాబు, విజిలెన్స్ విభాగం ఏఈఈలు కె.కోటేశ్వరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్ పాల్గొన్నారు.

నా మాటలు వక్రీకరించడం హేయం

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: కల్తీ మద్యంపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా వినుకొండలో జరిగిన ర్యాలీలో తాను అనని మాటను అన్నట్లుగా వక్రీకరించడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబరు, వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడ చూసినా బెల్టుషాపుల వలన మద్యం తాగి బజార్లలో తిరుగుతుంటే.. మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తాను అంటే ఆ మాటను పలుమార్లు సోషల్ మీడియాలో చూపించి తనపై బురద చల్లడం ఏంటని ప్రశ్నించారు. టీడీపీ నేతలు తమ అధికారాన్ని అక్రమ కేసులు బనాయించడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారని, అభివృద్ధి చేయడానికి అధికారాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతూ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ప్రస్తుత ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఒకవైపు చేపల చెరువులు, మరో వైపు బయో ఎరువులు అమ్ముకుంటూ నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారని గతంలో కూడా మాట్లాడామని, వాస్తవాలు అందరికీ తెలుసని, దమ్ముంటే వీటికి సూటిగా సమాధానం చెప్పాలని బొల్లా డిమాండ్ చేశారు.

రేపు జిల్లాస్థాయి సైన్స్ సెమినార్

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ శుక్రవారం శంకరభారతీపురం జడ్పీ హైస్కూల్‌లో జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ బుధవారం తెలిపారు. పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులు పోటీలో పాల్గొనేందుకు అర్హులన్నారు.

- పోటీలో పాల్గొనే విద్యార్థి 5 చార్టులు లేదా స్లైడ్స్ ఉపయోగించుకొని తన ప్రజెంటేషన్‌ను 6 నిమిషాలలో ముగించాలని తెలిపారు.
- అలాగే తరువాత 2 నిమిషాలలో 3 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 3డీ నమూనాలు, యానిమేషన్, వీడియోలు, సినిమాలు అనుమతించబడవన్నారు.
- విద్యార్థి ప్రదర్శనలో శాస్త్రీయతకు 40 మార్కులు, విజువల్స్ 15, ప్రసంగ పటిమ 25, రాసిన ఆప్టిట్యూడ్ టెస్ట్ 10, నోటి ప్రశ్నలకు సమాధానాలు 10 మార్కులు మొత్తంగా 100 మార్కులు ఇస్తామని వివరించారు.
- ఒక పాఠశాల నుంచి ఒక్క విద్యార్థికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు.
- జిల్లాస్థాయి సెమినార్ నుంచి ఇద్దరిని ఎంపిక చేసి ఈనెల 18న విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్టు తెలిపారు.
- రాష్ట్రస్థాయి విజేతలను ఈనెల 30వ తేదీన బెంగళూరులో జరగనున్న జాతీయస్థాయి సైన్స్ సెమినార్‌కు పంపుతారని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.రాజశేఖర్ 9959004434 సంప్రదించాలని సూచించారు.

రాగి తీగ దొంగలు అరెస్టు

ఐదుగురు నిందితుల నుంచి 110 కిలోల రాగి తీగ స్వాధీనం



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ హనుమంతరావు, ముసుగులో నిందితులు

నరసరావుపేట టౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో రాగి తీగెల చోరీకి పాల్పడుతున్న ఐదుగురు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎం.హనుమంతరావు వెల్లడించారు. బుధవారం రాత్రి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితులు సుమారు ఒక ఏడాది కాలం నుంచి బొల్లాపల్లి, ఐనవోలు, ఈపూరు, వినుకొండ, రాజుపాలెం, నకరికల్లు, అచ్చంపేట, చిలకలూరిపేట రూరల్ ప్రాంతాలలో సుమారు 20 కేసుల్లో 30 ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి 110 కేజీల కాపర్ వైర్ చోరీ చేశారన్నారు. ఈ మేరకు బొల్లాపల్లి, రేమిడిచర్ల సెక్షన్ ఏపీ సీపీడీసీఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వెంకట్రావు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. కేసును ప్రతిష్టాత్మక తీసుకున్న ఎస్పీ కృష్ణారావు తన ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయటంతో నిందితులైన ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన తన్నీరు నరసింహారావు, బొల్లాపల్లికి చెందిన గోగు నరసింహారావు, వినుకొండ మండలం పార్వతీపురం గ్రామానికి చెందిన ధూపాటి చిన్న బాలలింగయ్య, నరసరావుపేట పట్టణంలోని యానాది కాలనీకి చెందిన తిరువీధుల శ్రీకాంత్, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం అక్కపాలెం గ్రామానికి చెందిన మేఘావత్తు శ్రీను నాయక్, నూజెండ్ల మండలం తల్లార్లపల్లి గ్రామానికి చెందిన తాటిపర్తి నాగిరెడ్డిలు దుర్వ్యసనాలకు లోనై చోరీలకు పాల్పడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరిని బుధవారం ఈపూరు మండలం వడ్డంకుంట అడ్డరోడ్డు, బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామాలలో బండ్లమోటు ఎస్ఐ సిబ్బందితో అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో వినుకొండ రూరల్ సీఐ, బండ్లమోటు ఎస్ఐలు పాల్గొన్నారు.

తల్లి మందలించటంతో బాలిక బలవన్మరణం



బర్లా సోనాలి మృతదేహం

సత్తెనపల్లి: తల్లి మందలించటంతో మనస్థాపం చెంది బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సత్తెనపల్లి మండలం గండ్లూరు గ్రామంలో బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా జగద్గిరిగుట్టకు చెందిన బర్లా మంజుల, స్వామిలకు ముగ్గురు సంతానం. కుటుంబ కలహాలతో 13 ఏళ్ల క్రితం వీరు విడిపోవడంతో మంజుల ముగ్గురు పిల్లలతో హైదరాబాద్ జీహెచ్ఎంసీలో పారిశుద్ధ్య పనులు చేసుకుంటూ జీవించసాగింది. సుమారు ఏడు సంవత్సరాల క్రితం మియాపూర్ జీహెచ్ఎంసీ ఏరియాలో ఉంటూ పెయింట్ పని చేసుకుంటున్న పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామానికి చెందిన వంగిపురపు యేసయ్యతో పరిచయమై వివాహం చేసుకుంది. మొదటి భర్తతో కలిగిన ముగ్గురు సంతానంలో కుమారుడు బర్లా దుర్గాప్రసాద్ గొడవల కేసులో చిక్కుకొని మియాపూర్ జువెనల్ హోమ్‌లో ఉన్నాడు. రెండవ కుమార్తె బర్లా సోనాలి అలియాస్ పింకి(15), మూడవ కుమారుడు బర్ల సాహితీలు తల్లి, మారు తండ్రితో జీవిస్తున్నారు. ఈక్రమంలో ఆమె తన రెండో భర్తతో కలిసి సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామానికి వచ్చి కూతవేటు దూరంలోని గండ్లూరు జగనన్న కాలనీలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని జీవిస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 14న కుమార్తె సోనాలి సత్తెనపల్లిలో ఓ కొత్త సినిమాకు తీసుకు వెళ్లమని తల్లి మంజులను కోరడంతో మంజుల సిని మాలు, షికార్లు వద్దంటూ మందలించింది. దీంతో మనస్థాపం చెందిన సోనాలి ఇంట్లో బెడ్‌రూమ్‌లోనికి వెళ్లి తలుపులు గడియ పెట్టి చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అలిగి పడుకుందనుకున్న కుమార్తె సోనాలిని సుమారు అర్ధరాత్రి 2:30 గంటల సమయంలో మంజుల తలుపు కొట్టి పిలవగా ఎంతసేపటికీ తీయకపోవడంతో తలుపురంధ్రం నుంచి చూడగా కాళ్లు వేలాడుతుండటంతో రాత్రి పూట పెయింట్ పనికి వెళ్లిన భర్త యేసయ్యకు ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో యేసయ్య, అతని బావమరిది చింతపల్లి సుబ్బారావులు వచ్చి 3:30 గంటల సమయంలో వీడియో తీస్తూ తలుపులు పగలగొట్టి ఉరి వేసుకున్న మృతురాలు సోనాలిని కిందకు దించారు. సంఘటనా స్థలానికి సత్తెనపల్లి టౌన్ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు, సత్తెనపల్లిరూరల్ పోలీసులు సందర్శించి మృతదేహన్ని పోస్ట్ మార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన బసంతి గణేష్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ హైమారావు

- మరో యువకుడికి తీవ్ర గాయాలు
- సర్టిఫికెట్ల కోసం గుంటూరు వెళ్తుండగా ప్రమాదం

నరసరావుపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కారంపూడికి చెందిన బసంతి గణేష్(26), రాగి హనుమంత చారి ఇద్దరు గుంటూరులోని ఓ కళాశాలలో ఉన్న సర్టిఫికెట్లు తీసుకునేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యంలోని నరసరావుపేట-గుంటూరు రోడ్డుపైకి వచ్చేసరికి టర్నింగ్ వద్ద లారీని ఢీకొనడంతో బైక్ లారీ వెనుక టైర్ల మధ్య ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న బసంతి గణేష్ అక్కడికక్కడే మృతి చెందగా, రాగి హనుమంత చారికు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. లారీ కింద ఇరుక్కుపోయిన ద్విచక్రవాహనాన్ని క్రేన్ సహాయంతో బయటకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అతి వేగం కారణంగా ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రూ.3.4 లక్షల విలువైన బంగారం స్వాధీనం

లక్ష్మీపురం: గుంటూరు కృష్ణ కెనాల్ జంక్షన్ వద్ద కొన్ని రోజులుగా వరుసగా రైళ్లలో చైన్ స్నాచింగ్ చేస్తూ పలు రాష్ట్రాల పోలీసులకు సవాల్‌గా మారిన సంజయ్ రాయ్, అతని గ్యాంగ్ సభ్యులను గుంటూరు రైల్వే జీఆర్పీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. రైల్వే జీఆర్పీ డీఎస్పీ అక్కేశ్వరరావు, సీఐ అంజిబాబులు తెలిపిన వివరాల ప్రకారం... కేసులోని నిందితులు పలు రాష్ట్రాల మధ్య రైళ్లలో తిరుగుతూ నేరాలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయా రాష్ట్రాలలో ఈ గ్యాంగ్‌పై 50కిపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ నెల 4వ తేదీన గుంటూరు రైల్వే స్టేషన్‌లో ముగ్గురు పారిపోయేందుకు యత్నించగా, అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకడైన హరియాణాకు చెందిన సతేందర్ కుమార్ జవాన్‌గా చేసి హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. మిగతావారు రాజస్థాన్‌కు చెందిన సతీష్ గుజ్జర్ అలియాస్ గుజ్జర్, రవికుమార్ అలియాస్ ప్రజాపతి అని తెలిసింది. రూ.3.4 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. వీరి ముఠా నాయకుడు సంజయ్ రాయ్ అని దర్యాప్తులో తేలింది. అస్సాంలో స్థానిక పోలీసుల సహాయంతో అతడిని బుధవారం అరెస్టు చేశారు. ముఠాలో 10 మంది ఉన్నారని వెల్లడైంది.

ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్ విడుదల

లక్ష్మీపురం: ఏపీఐఐసీ - ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. నవంబర్ 14, 15వ తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న భాగస్వామ్య సదస్సు (పార్టనర్ షిప్ సమ్మిట్)లో భాగంగా ఈ పోస్టర్ విడుదల చేశామని తెలిపారు. పీసీబీ కార్యనిర్వాహక ఇంజినీరు ఎం.డి.నజీనా బేగం, ఏపీఐఐసీ జీఎం డాక్టర్ ఎం.ఎల్ నరసింహారావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఎ. జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

మంగళగిరి టౌన్: యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి రెండేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధిస్తూ మంగళగిరి అడిషనల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కమ్ సివిల్ జడ్జి, జూనియర్ డివిజన్ ఎం.ప్రసన్న లక్ష్మి బుధవారం వెలువరించారు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి మండలంలోని నూతక్కి గ్రామానికి చెందిన ఓ యువతి 2019లో ఇంటి వద్ద స్నానం చేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన బోళ్ల వెంకటరెడ్డి తొంగిచూశాడు. ఆమె గమనించి ఇంట్లోకి వెళ్లారు. అతడూ వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు వచ్చారు. నిందితుడు పరారయ్యాడు. మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తాజాగా తీర్పు వెలువరించారు. అసిస్టెంట్ ప్రాసిక్యూటర్ ఎ.శివలీల ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ఆధిపత్య పోరుతోనే హత్య

తెనాలిరూరల్: తెనాలిలో కలకలం సృష్టించిన హత్య కేసును పోలీసు ఛేదించినట్టు సమాచారం. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కోరుతాడిపర్రుకు చెందిన జూటూరి తిరుపతిరావు అలియాస్ బుజ్జి తెనాలిలో మంగళవారం దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే నిందితుడిని గుర్తించినట్టు తెలిసింది. గ్రామంలోని రామాలయం విషయంలో ఆధిపత్య పోరు ఉన్న వరుసకు అల్లుడయ్యే వ్యక్తే హత్యకు పాల్పడ్డాడని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ప్రస్తుతం నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం.

సత్తెనపల్లిలో వ్యాపారి బలవన్మరణం

సత్తెనపల్లి: వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని సంఘం బజార్‌కు చెందిన చెందిన లఘువరపు హనుమంతరావు(52) వెంకట భాను జనరల్‌స్టోర్ నిర్వహిస్తుంటాడు. ఆయనకు భార్య శైలజ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత 8 నెలలుగా సోదరుడి కుమారుడు లఘువరపు రమేష్, బావమరిది దరివేముల రామకృష్ణతో వ్యాపార, కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ క్రమంలో వ్యాపారానికి సోదరుడి కుమారుడైన రమేష్ అడ్డు తగలడం, కుటుంబం విషయంలో బావమరిది రామకృష్ణ ప్రమేయంతో మనస్థాపం చెందిన హనుమంతరావు ఈ నెల 12న గడ్డి మందు కొనుక్కొని తన దుకాణంలో తాగి ఇంటికి వెళ్లాడు. ఇంటి వద్ద వాంతులు చేసుకోవడంతో భార్య శైలజ గమనించి హుటాహుటిన పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ హనుమంతరావు బుధవారం మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పట్టణ ట్రైనీ ఎస్ఐ యష్న మృతుడి వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.